
# హ్యూమన్ సైకాలజీ

దూరి వెంకటరావు




ఆ క్షణంలో అందమైన అమ్మాయితో కాసేపు కాలక్షేపం సాగించడమే అతగాడి ఉద్దేశం. 'మనస్తత్వ విజ్ఞాని'గా అతగాడు తన స్నేహితునికి పాఠం బోధించాడు కానీ, అసలు నిజం బాంబులా పేలినప్పుడు...?

సిటీ బస్ కోసం స్టాప్‌లో కొచ్చి నిలబడ్డారు పవన్, పరశురామ్.

"నమస్తే!" విష్ చేసిం దో రెండు జడల అమ్మాయి, పవన్ దగ్గర కొచ్చి చిరునవ్వులు చిందిస్తూ.

ఆ నవ్వులో అద్భుతమైన ఆకర్షణ ఉంది. మాటల కందని అందం ఉట్టి పడుతోంది.

"మీ రిచ్చిన చిరునామాకు రెండు మార్లు ప్రయత్నించాను, అయినా..." గిటారు వాయిద్యంలా మధురంగా ఉం దామె కంఠం.

గు ర్తుపట్టిన్తూ ఆమె వంక చూశాడు పరశురామ్.

గుండ్రని ముఖం, విశాలమైన నేత్రాలు, తీరైన నాసిక, మేలిమి రంగుతో మిల మిలా మెరిసిపోతోంది.

"మి... మీరు..." తొట్రుపాటును కనిపించనీయకుండా జాగ్రత్త పడుతూ అడిగాడు పవన్.

"గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో మనం కలిసి ప్రయాణం చేశాం!" గుర్తు చేసిం దామె.

మాట్లాడలేదు పవన్.

"మీరు దరఖాస్తు పట్టుకు రమ్మన్నారని..."

"సారీ! మీ రెవరో నాకు తెలీదు. ఎవర్ని చూసి ఎవ రనుకుంటున్నారో?"

పవన్ మాటలకు కంగు తిన్నట్లైపోయి, చిన్నబుచ్చుకున్న మోముతో ముందుకు సాగిపోయిం దామె.

ఆమెను ఆ స్థితిలో చూసిన పరశురామ్‌కు జాలి వేసింది.

"అంత చనువుగా పలకరించిన ఆ అమ్మాయిని తెలీ దంటా వేమిట్రా?" అని అడిగాడు మిత్రుడి చర్యకు మండిపడుతూ.

"బస్సు వచ్చింది. పద ముందు." పరశురామ్‌ని ముందుకు నెట్టాడు పవన్.

పరశురామ్ బస్సులో కూర్చున్నా డన్న మాటే కాని, మనసు మాత్రం పవన్‌ను పలకరించిన అమ్మాయి మీదే ఉంది.

బస్సు దిగి హాస్టల్స్‌కు వెళ్లే తోవలో ఆ అమ్మాయిని గురించి అడిగాడు ఆదుర్దా అణచుకోలేక.

చెప్పడం ప్రారంభించాడు పవన్.

** ** **

సికింద్రాబాద్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కి బెర్తు నంబరు వెతుక్కుంటూ ఒకచోట చతికిల బడ్డాడు పవన్.

ఎదుటి బెర్తు మీద ఒంటరిగా కూర్చుని వార్తాపత్రిక చదువుకుంటుం దో అమ్మాయి.

"ఎక్స్‌క్యూజ్ మీ! పేపరులో అనుబంధాన్ని ఓమారు..."

పవన్ మాటలకు చురుకుగా చూసిం దామె.

"సారీ ఫర్ ది డిస్టర్‌బెన్స్."

"నెవర్ మైండ్!" పేపర్లోని అనుబంధాన్ని విడదీసి అతడి కిచ్చింది.

ఆమెకు ఇరవై ఏళ్లుంటాయి. నన్నజాజి తీగలా నాజూకుగా ఉంది. నిర్మలంగా



## ఉగాది కథల కలకలం !

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం నిర్వహిస్తున్న ఉగాది కథల పోటీకి గడువు ముగిసే సమయానికి ఆరు వందలకు పైగా కథలు వచ్చాయి. వివిధ రాష్ట్రాల నుంచి కూడా పోటీకి కథలు రావడం విశేషం ! అనూహ్యమైన ఈ స్పందన ఆంధ్రప్రభ అనుబంధం పట్లగల పాఠక ఆదరణకు అద్దం పడుతోంది. విజేతలను నిర్ణయించేందుకు కథల వడపోత కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. వడపోత వైనాన్ని, ఇతర వివరాలను వచ్చేవారం సంచికలో తెలుసుకోండి !**

మెరుస్తున్నాయి ఆమె కళ్లు. అస్తమించే సూర్యబింబాన్ని వెక్కిరించేంత ఎర్రగా ఉన్నాయి ఆమె పలుచని పెదాలు.

"మీ పేరు తెలుసుకోవచ్చా?"

"సరిత !"

"లవ్లీ !"

'నా పేరుతో నీ కేం పని' అన్నట్టు అతడి వంక తీక్షణంగా చూసి పేపర్లోకి తల దూర్చిం దామె.

మెలమెల్లగా ఆమెను సంభాషణలోకి దింపి కొన్ని గంటలు సరదాగా కాలక్షేపం చేయవచ్చు 'ననుకున్నాడు. అయితే, ఆమె తుంచినట్టు జవాబివ్వడంతో బిర్రబిగుసుకుపోయాడు. మెదడు మాత్రం చురుగ్గా పని చేయడం ప్రారంభించింది.

కాసేపు అనుబంధాన్ని అటూ ఇటూ తిప్పి - "నన్ను పవన్ అంటారు. విశాఖలో ఒక పేరున్న కంపెనీలో జి.ఎం. వద్ద పి.ఎ.గా పని చేస్తున్నాను. వైజాగ్‌లో మీ కే అవసరం పడినా నన్ను కలుసుకోవచ్చు" అంటూ చిరునామా చెప్పాడు పవన్.

అతడు ఊహించినట్లే ఆమెలో మార్పు కనిపించింది. చనువుగా మాట్లాడ్డం ప్రారంభించింది. తన కుటుంబ విషయాల్ని అతడితో ప్రస్తావించింది.

తర్వాత వారి సంభాషణ సినిమాల మీదకు, రాజకీయాల పైకి మళ్లింది.

ఆమెతో మాట్లాడుతూ ప్రయాణం చెయ్యడం ఓ థ్రిల్‌గా ఉం దతడికి.

"నా ఆర్థిక స్థితిగతుల్ని దాచకుండా చెప్పాను. దయచేసి మీ కంపెనీలో నా కేదైనా..."

"తప్పకుండా. మీ వంటి అందమైన అమ్మాయిలను మా కంపెనీ వాళ్లు రిసెప్షనిస్టులుగా రిక్రూట్ చేయాలనుకుంటున్నారు. మా మేనేజర్‌కు నే నెంత చెబితే అంతే! దరఖాస్తు పట్టుకు రండి, నాకు చేతనైన సహాయం చేస్తాను."

"థాంక్యూ!" కృతజ్ఞత కదలాడిం దామె కళ్లలో.

** ** **

"మరి ఆమెతో అపరిచిత వ్యక్తిలా ప్రవర్తించావేం?" అడిగాడు పరశురామ్.

"చూడు మిస్టర్! నువ్వు చదువుకున్నా వన్నమాటే తప్ప నీకు జనరల్ నాలెడ్జ్ నామమాత్రమైనా లేదు. రైల్లో మీటింగులూ, సినిమాహాల్లో సీయింగులూ అక్కడితో తెంచేసుకోవాలి. రైల్లో కంపెనీ లేకపోవడంతో బోరు ఫీలయ్యాను. ఓ అందమైన అమ్మాయి చెంతనుంటే ఎంతో బావుండు ననిపించిం దా క్షణం. అంతే! కాలక్షేపం కోసం ఆమెతో మాటలు కలిపాను. మన కిక్కడ యూనివర్సిటీలో అమ్మాయిలే కరువా?" ఎంతో తేలిగ్గా జవాబిచ్చాడు పవన్.

"అది సరే. మరి ను వ్వేదో ఉద్యోగం ఇప్పించేసినట్లు అబద్ధం ఆడవలసిన ప నేమొచ్చింది?"

"అక్కడే ఉంది టెక్నిక్. మన అవసరం ఉంటే తప్ప అవతల వ్యక్తులు మనతో కలివిడిగా ఉండరు. దినపత్రికలోని అనుబంధాన్ని ఆమె ఇచ్చింది. చదివేసి ఆ అనుబంధా న్నిచ్చేశాను. అంతటితో ఆ అనుబంధం సరి. అదీ మానవుడి మనస్తత్వం. అందుకే ఓ చిన్న అబద్ధం. దాంతో అయిపోయింది."

పవన్ మాటలకు హతాశు డయ్యాడు పరశురామ్.

** ** **

మర్నాడు పది గంటలకు ఆఫీసులో అడుగు పెట్టగానే జి. ఎం. గారు రమ్మన్నారని కబురొచ్చింది పవన్‌కు.

"లల్లలా లల్లలా లల్లలా" అని పాడుకుంటూ హుషారుగా వెళ్లాడు జి. ఎం. గదిలోకి.

"గుడ్ మార్నింగ్! మిస్టర్ పవన్! డిక్టేషన్ ఇస్తాను రాసుకోండి" అన్నాడు జి. ఎం.

"ఓ ఎస్ రెడీ సార్!" అన్నాడు పవన్.

"మిస్టర్ పవన్! నీ సేవలు ఇక మా కక్కరలేదు. నీ జీతం కవరు ఇక్క డుంది" అని డిక్టేషన్ ఇచ్చాడు జి. ఎం.

"ఆ దేం ట్సార్ ఈ అన్యాయం? నేను మీ కేం అపకారం చేశాను సార్?" అన్నాడు పవన్ వణికిపోతూ.

"నువ్వు నిరుద్యోగినులైన అమ్మాయిల జీవితంతో ఎన్నాళ్లనించీ చెలగాట మాడుతున్నావ్? సరిత అనే అమ్మాయికి ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశావా, లేదా? ఆ సరిత ఎవరో తెలుసా? మా అమ్మాయి !" అన్నాడు జి. ఎం. ★